మనం
కడప | అన్నమయ్య

## పోలీస్ అంటే భయం కాదు.. ప్రజలకు కొండంత భరోసా!



వివరాలు 6లో







# మంత్రి సవితకి ఘనస్వాగతం పలికిన ఇంచార్జి జగన్మోహన్ రాజు, టీడీపీ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్

మనం ప్రతినిధి కడప సెప్టెంబర్ 26
కడప జిల్లా సిద్ధవటం వద్దగల 11వ పోలీస్ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవితకి సిద్ధవటంలో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రిని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి జగన్మోహన్‌రాజు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ కలిసి శాలువాలు, భారీ గజమాలతో సత్కరించి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రి చూపుతున్న చొరవను వారు కొనియాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి జగన్మోహన్ రాజు ప్రత్యేకంగా మాట్లాడుతూ, రాజంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపుతో పాటు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని జగన్మోహన్ రాజు మంత్రి గారిని కోరారు. అదేవిధంగా రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సాగుతోందని హర్షం



వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా పార్టీ కేడర్ ఎంతో ఉత్సాహంతో పనిచేస్తోందని, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కష్టపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జనసేనలో పెరుగుతున్న రాయలసీమ ప్రాధాన్యం

**యల్లటూరు-ఎనమల వ్యూహాత్మక కలయిక - సంస్థాగత నెట్‌వర్క్‌పై దృష్టి: ఎన్నికల వేళ కీలక సమన్వయం**







మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 26: రాష్ట్రంలో సాధించిన విజయానంతరం జనసేన పార్టీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు, పార్టీ కేంద్రఎన్నికల కమిటీ సభ్యుడు ఎనమల భాస్కర్ మధ్య జరిగిన భేటీ కేవలం లాంఛనప్రాయమైనది కాదని, పక్కా రాజకీయ వ్యూహమని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న క్యాడర్ బలాన్ని ఓటు బ్యాంకుగా ఎలా మలచాలి, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాలను ఎలా ఎంపిక చేయాలనే అంశాలపై ఇరు వురు నేతలు లోతైన అభిప్రాయాలను పంచుకున్నారు.

**రాయలసీమలో పట్టు కోసం అధిష్ఠానం ముందస్తు ప్రణాళికలు**

గ్రేటర్ రాయలసీమ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీలో ఎనమల భాస్కర్‌కు చోటు దక్కడం వెనుక అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక వ్యూహం దాగి ఉంది. ఈ ప్రాంతంలో పార్టీ వేళ్లను బలంగా నాటడానికి స్థానిక నాయకత్వానికి పెద్దపీట వేస్తున్నారనే సంకేతాన్ని ఈ నియామకం ఇచ్చింది. యల్లటూరు శ్రీనివాసరాజు స్వయంగా ఎనమలను సత్కరించి శుభాకాంక్షలు తెలపడం ద్వారా సీనియర్ నేతల మధ్య సమన్వయం, పార్టీ పట్ల నిబద్ధత ఉన్నాయనే సందేశం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. రాయలసీమలో జనసేనను తిరుగులేని శక్తిగా నిలబెట్టేందుకు ఇలాంటి నిర్ణయాలు దోహదం చేస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కూటమి బలం-పార్టీ స్వయం ప్రతిపత్తి: భావి సవాళ్లకు సమాయత్తం**

రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగుతున్న నేపథ్యంలో, స్థానిక సంస్థల సమరంలో మిత్రపక్షాలతో సఖ్యతను కాపాడుకుంటూనే జనసేనకు దక్కాల్సిన సరైన ప్రాధాన్యాన్ని సాధించుకోవడం ఈ నేతలకు ఎదురయ్యే ప్రధాన బాధ్యత. క్షేత్రస్థాయిలో జనసైనికుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని, సమన్వయ లోపాలు తలెత్తకుండా పార్టీ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంపైనే వీరు దృష్టి సారించారు.

కార్యకర్తలను కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం చేయకుండా అధికారిక భాగస్వామ్యంలో భాగం చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నట్లు ఈ భేటీ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



# మంత్రి సవితతో రాజంపేట అభివృద్ధిపై చమర్తి జగన్ మోహన్‌రాజు చర్చ

కడప మనం ప్రతినిధి సెప్టెంబర్ 26: రాజంపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి మరియు కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీమతి ఎస్. సవితమ్మతో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్‌రాజు కూలంకషంగా చర్చించారు. కడప నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశంలో రాజంపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ముఖ్య నాయకులతో కలిసి చమర్తి జగన్ మోహన్ రాజు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం



తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజలకు వేగవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ భేటీలో రాజంపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో కడప ఎయిర్‌పోర్ట్ నూతన టర్మినల్: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

మనం ప్రతినిధి కడప సెప్టెంబర్ 26
కడప విమానాశ్రయంలో చేపట్టిన నూతన డొమెస్టిక్ టర్మినల్ భవన నిర్మాణ పనులను అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యున్నత నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రాష్ట్ర మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎంపీ సీఎం సురేష్ నాయుడు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌లతో కలిసి ఎయిర్‌పోర్ట్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ప్రయాణికుల సౌకర్యార్థం దేశీయ విమానాశ్రయాలను అత్యాధునిక హంగులతో కేంద్రం తీర్చిదిద్దుతోందని, పర్యావరణానికి విఘాతం కలగకుండా పనులు వేగవంతం



చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పురోగతిని వివరిస్తూ.. సుమారు రూ.266 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన టర్మినల్ పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని మంత్రికి తెలిపారు. 16,455 చదరపు



మీటర్ల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ నూతన భవనం ద్వారా రద్దీ సమయాల్లో గంటకు 1,800 మంది, ఏటా దాదాపు 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. రాత్రి వేళల్లోనూ విమానాల రాకపోకలకు వీలుగా నైట్ ల్యాండింగ్ సదుపాయంతో పాటు 24 చెక్-ఇన్ కౌంటర్లు, 3 ఏరో బ్రిడ్జిలు, ఏకకాలంలో ఏడు కోడ్-సి విమానాలను నిలిపే పార్కింగ్ బేలు అందుబాటులోకి వస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉడాన్ పథకం కింద ఆధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ విమానాశ్రయం మరియు మెరుగవుతున్న రహదారి అనుసంధానం వల్ల జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు

## తొండూరు మండలంలోని వైన్ షాప్ ఏర్పాటుకు దరఖాస్తు ఆహ్వానం

ముద్దనూరు, సెప్టెంబర్,26, మనం న్యూస్:
ముద్దనూరు ఎక్సైంజ్ కార్యాలయం పరిధిలోని తొండూరు మండలానికి సంబంధించి వైన్ షాప్ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వినీలత శనివారం ప్రకటనలో తెలిపారు. వైన్ షాప్ ఏర్పాటు కొరకు అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా అవసరమైన వివరాలతో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవలసిన వారు రూ.3 లక్షలు (నాన్-రిఫండబుల్)గా, లైసెన్స్ ఫీజు రూ.60.5 లక్షలు, పర్మిట్ రూమ్ ఫీజు రూ.5 లక్షలుగా నిర్ణయించినట్లు వివరించారు. ఆసక్తి గల వారి నుంచి 01-10-2026 మధ్యాహ్నం 12 గంటల వరకు అప్లికేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 05-10-2026 ఉదయం 8 గంటలకుగా డ్రా పద్ధతిలో ఫలితాలను ప్రకటిస్తామన్నారు. మరింత సమాచారం కొరకు ముద్దనూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిఐ ను 9440902604 నంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

## స్కూల్ గ్రాంట్లు వెంటనే విడుదల చేయాలి:యుటిఎఫ్

పెనగలూరు(సెప్టెంబర్ 26),మనంన్యూస్:
2026-27 విద్యా సంవత్సరానికి 50% గ్రాంట్లను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆగష్టు 22 న ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, నిధులు ఎలా వినియోగించాలో మార్గదర్శకాలు ఇచ్చారు కానీ ఇంతవరకు ఆ నిధులు పాఠశాలలకు జమకాలేదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు బి.హరి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై మూడు మాసాలు గడిచిందని చెప్పారు. ఈమధ్య కాలంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ స్వంత సొమ్ముతో పాఠశాలల నిర్వహణ కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో యస్ యం సి ఎన్నికలు కూడా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు, సమావేశాలు జరపాలని ఉత్తర్వులు ఇచ్చి నిధులు ఇవ్వకపోతే ఎలా అని యుటిఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బి. హరి ప్రసాద్, పెనగలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాస కుమార్, యం. నరసింహారావు ప్రశ్నించారు. వెంటనే విద్యా శాఖ అధికారులు స్పందించి జాప్యం లేకుండా పాఠశాలల ఖాతాలో నేరుగా నిధులు జమచేయాలని డిమాండ్ చేశారని తెలిపారు.పాఠశాల నిధుల జమలో కఠిన సాంకేతిక,సంక్లిష్టత విధానం అమలుచేయకుండా సకాలంలో విడుదల చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## శుద్ధ జలం- సుఖీభవం: ఎస్.ఎల్.వివిఎస్ నీటి ట్యాంకుల క్లీనింగ్ సేవలు సద్వినియోగం చేసుకోండి

### చిట్వేలీ మండల వ్యాప్తంగా మా సేవలు అందుబాటులో ఉంటాయి

చిట్వేలి సెప్టెంబర్ 26 మనం న్యూస్: ?ప్రస్తుత కాలంలో కలుషిత నీటి వల్ల వచ్చే రోగాలు పెచ్చురిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఇంట్లో మరియు వ్యాపార సంస్థలో సురక్షితమైన నీటిని తాగడం మరియు వాడుకోవడం చాలా ముఖ్యం. దీని కోసం ఎస్.ఎల్.వివిఎస్ (రాయా) ట్యాంక్ క్లీనింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మొదటగా చిట్వేలి మండల వ్యాప్తంగా ప్రారంభించి, అనంతరం రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేయడానికి అందుబాటులో ఉంటామని వారు తెలిపారు. ?మీ ఇంటి మరియు వ్యాపార అవసరాలకు సంబంధించిన అన్ని రకాల నీటి ట్యాంకులను (పైన ఉన్న ట్యాంకులు మరియు భూగర్భ ట్యాంకులు) ఎస్.ఎల్.వివిఎస్ క్లీనింగ్ బృందం అత్యంత జాగ్రత్తగా క్లీన్ చేస్తారు. ఈ సేవల్లో గాలిపీల్చడం వల్ల ఏర్పడే దుమ్ము, మట్టి, బాక్టీరియా మరియు క్రిములను పూర్తిగా తొలగించడం జరుగుతుంది. అలాగే, ట్యాంక్‌లోని క్రిములను చంపడానికి మరియు డిస్‌ఇన్‌ఫెక్షన్ చేయడానికి ప్రత్యేక పద్ధతులను ఉపయోగిస్తారు. ఈ సేవలు చాలా సరసమైన ధరల్లో మరియు నిర్ణీత సమయంలోనే అందించబడతాయి. దీని వల్ల మీరు మీ ఇంటి నీటి నాణ్యతను మెరుగుపరుచుకోవడమే కాకుండా, మీ కుటుంబ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. మీ ఇంటి మరియు వ్యాపార అవసరాలకు కావలసిన ట్యాంక్ క్లీనింగ్ సేవల కోసం వెంకీ: 9908735812
కోటి: 97018 72897 ఫోన్ నెంబర్లకు సంప్రదించి ఈ సేవలను ఉపయోగించుకోవాలని ప్రజలను వారు కోరారు.

## 100 శాతం సర్వే పూర్తి అయ్యేలా చూడాలి

ఒంటిమిట్ట సెప్టెంబర్ 26(మనం న్యూస్) ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి,లెప్రసి,ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ రవిబాబు ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలొ జరుగుతున్న లెప్రసి సర్వే గురించి డాక్టర్ అరుణ జ్యోతి గారిని అడిగి తెలుసుకొని, తగు సూచనలను చేసి 100 శాతం సర్వే పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు.ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్ ను క్షయ వ్యాధిగ్రస్తులకు చేస్తున్న పరీక్షలు,రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.క్షయ వ్యాధి గ్రస్థులకు అందుతున్న చికిత్స, రికార్డుల నిర్వహణ గురించి ఫార్మాసిస్ట్ అరుణని అడిగి తెలుసుకున్నారు.

## మంత్రి సవితమ్మను కలిసిన డాక్టర్ నవీన్ కుమార్

సిద్ధవటం (మనంన్యూస్), సెప్టెంబర్ 26:సిద్ధవటంలోని 11వ బెటాలియన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన “దీక్షాంత్ పరేడ్” (పాసింగ్ అవుట్ పరేడ్) కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి సవితమ్మ ని డాక్టర్ నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రితో ప్రత్యేకంగా సమావేశమై రాజంపేట మున్సిపాలిటీలోని ప్రస్తుత పరిపాలనా పరిస్థితులు, పట్టణాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై చర్చించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే, పార్టీ విజయానికి అంకితభావంతో పనిచేసి గెలుపొందుతానని మంత్రి వద్ద ప్రస్తావించారు. దీనిపై మంత్రిగారు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ నవీన్ కుమార్ వెల్లడించారు.







## గ్రామీణ రహదారులకు మహర్దశ

## రూ.21.16 కోట్లతో 12 రోడ్డు పనులు ప్రారంభం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

మనం న్యూస్ రాయచోటి సెప్టెంబర్ 26
?రాయచోటి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సాస్కి నిధులతో రూ.21.16 కోట్ల అంచనా వ్యయంతో 12 రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, రాయచోటి, సంబేపల్లి మండలాల్లో మొత్తం 2,116 మీటర్ల మేర ఈ రోడ్డు పనులు శరవేగంగా కొన సాగుతున్నాయి. గ్రామీణ రహదారుల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మండల, నియోజకవర్గ కేంద్రాలకు గ్రామాల రాకపోకలు మరింత సులభతరం కావడమే ఈ పనుల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం సులువవుతుందని, అలాగే విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయని మంత్రి స్పష్టం చేశారు. చిన్నమండెంలో రూ.1.24 కోట్లతో రెండు పనులు, గాలివీడులో రూ.3.98 కోట్లతో రెండు, లక్కిరెడ్డిపల్లిలో రూ.4.88 కోట్లతో రెండు, ఎల్.ఆర్.పల్లిలో రూ.1.68 కోట్లతో ఒక పని, రామాపురంలో రూ.1.65 కోట్లతో ఒక పని, రాయచోటి మండలంలో రూ.4.64 కోట్లతో రెండు, సంబేపల్లిలో రూ.3.09 కోట్లతో రెండు పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా చేపడుతున్నట్లు వివరించారు. ప్రారంభించిన అన్ని రహదారి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కేవలం గ్రామీణ రోడ్లే కాకుండా రాయచోటి మున్సిపాలిటీలోనూ రూ.10.84 కోట్లతో 68 అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని గుర్తుచేశారు. నియోజకవర్గవ్యాప్తంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి అన్ని మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేసి రాయచోటిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పునరుద్ఘాటించారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఓ వరం లాంటిది





**- ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్షుమ్మ**

ఎనగలూరు(సెప్టెంబర్ 26),మనంన్యూస్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వర లక్షుమ్మ తెలిపారు. శనివారం పెనగలూరు మండలంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు వారి ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని పేర్కొన్నారు.నారాయణ నెల్లూరు గ్రామానికి చెందిన లక్ష్మీ నరసమ్మ కు రూ.38,795, ఇదే గ్రామానికి చెందిన కొత్తపల్లి రుద్ర కుమార్ కు రూ. 17,114, ఓబిలి గ్రామానికి చెందిన హుజైపా కు రూ.25 వేలు, ఇదే గ్రామానికి చెందిన మీర్జాన్ కు రూ.40,373, గౌసున్నిసా కు రూ.30వేలు, మలిశెట్టి సునీల్ కు రూ.42,623, కంబాల కుంట గ్రామానికి చెందిన నరసింహులు కు రూ.25,166, జెట్టివారిపల్లికి చెందిన సుగుణమ్మ కు రూ.30,786, పాత సింగనమల కు చెందిన విజయ లక్ష్మీ కి రూ.108,729, సింగనమల కు చెందిన వెంకట నరసమ్మ కు రూ.25,166, యల్లయ్య కు రూ.30 వేలు, గడ్డ మీద దళితవాడ కు చెందిన తిప్పన నాగరాజు కు రూ.73,300, కంబాల కుంట బీసీ కాలనీ కి చెందిన నరసింహ కు రూ.21,795, పార్వతమ్మ కు రూ.13 వేలు, ఎగువ సిద్ధవరం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డికి రూ.91,682, సిద్దవరం గ్రామానికి చెందిన సుబ్బమ్మ కు రూ.65,795, పెనగలూరు పంచాయతీ కి చెందిన రవీంద్రబాబుకు రూ.1,57,297, సాయి వెంకట రమణకు రూ.33,332, రంగారెడ్డి కి రూ.43,450, నాగిరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాసులు రెడ్డికి రూ.82,215, జయమ్మకు రూ. 72,254, సాతుపల్లికి చెందిన వెంకటేష్ కు రూ.73,814, నరసయ్య కు రూ.51,087, శైలజకు రూ.50,462, ఇండ్లూరుకు చెందిన భవానికి రూ.102, 708, అనంతంపల్లికి చెందిన లక్షుమ్మ 41,112, ఎన్ఆర్ పురంకు చెందిన బాబు కు రూ.79,004, ముద్రపల్లి కి చెందిన సాయి నంద కు రూ.37,551, నల్లపురెడ్డి పల్లి దళితవాడకు చెందిన జయ రామయ్య కు రూ. 25 వేలు, పొందలూరు కు చెందిన శ్రీ లక్ష్మీ కి రూ.82,777, చక్రంపేట కు చెందిన లక్ష్మీ శాంతి కి రూ.61,572 చెక్కులను వారి ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ మాజీ మండల అధ్యక్షులు, ఎక్స్ ఎంపిటిసి సభ్యుడు కొత్త బాలకృష్ణ, దాసరి దామోదర్ నాయుడు, సుదర్శన్ నాయుడు, చక్రంపేట సురేష్ రెడ్డి, కొత్తపల్లి కళా చంద్ర, మాడపూరి శ్రీనివాసులు, డిష్ కరీముల్లా, అమిరుల్లా, హబీబ్, కె ఎన్ ఆర్, జనసేన నాయకులు గోబ్బూరు హరి బాబు, తొండపునాటి రాజేష్, ఉగ్ర నరసింహ, సాయి, ప్రదీప్, మారంరెడ్డి శివయ్య, కంబాలకుంట మదన్, లింగం నరేష్, గానుగపెంట వెంకటయ్య, కోదూరు మురళి, వెంకట సుబ్బయ్య, సిద్దవరం యానాదయ్య, యల్లయ్య, జనార్ధన్ రెడ్డి, తిరుణంపల్లి చంద్రశేఖర్, సింగనమల సుబ్బరాయుడు, మహేంద్ర, మనోజ్ రెడ్డి, చిన్నపురెడ్డి, పిచ్చయ్య, చలపతి పాల్గొన్నారు.

## కే-బుడుగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 26, మనం న్యూస్ : తిరుపతి జిల్లా 127-ఎస్సీ రైల్వే కోడూరు నియోజకవర్గం, రైల్వే కోడూరు మండల పరిధిలోని కే-బుడుగుంటపల్లి గ్రామ పంచాయతీలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం “అంగన్‌వాడీ ఉత్సవాలు” కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీమతి నిర్మలా దేవి, సీడీపీవో శ్రీమతి రేణుకా, అంగన్‌వాడీ టీచర్ శ్రీమతి రాజమ్మ, అంగన్‌వాడీ హెల్పర్లు, ఆరోగ్య కార్యకర్తలతో పాటు మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీమతి కుప్పాల జ్యోతి పాల్గొన్నారు. వీరితో పాటు బిజెపి మండల అధ్యక్షులు సాయం శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు కాళప్పగారి రాము, కుప్పాల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమా మహేశ్వర రెడ్డి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి సాయి ఆచారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సేవలు, ప్రీ-స్కూల్ విద్యా బోధన కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును నాయకులు, అధికారులు సమగ్రంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సకాలంలో అందుతోందని, ఇది తమ పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో తోడ్పడుతోందని స్థానిక తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఈ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు గాను భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా అంగన్‌వాడీ సేవలను అంకితభావంతో, నిష్టతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలను ఈ సందర్భంగా నాయకులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు.



# మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

## సీట్ల సర్దుబాటులో సమన్వయం.. కూటమి అభ్యర్థుల గెలుపే ఏకైక లక్ష్యం





రాయచోటి మనం న్యూస్ సెప్టెంబర్ 26 రాయచోటి అన్నమయ్య జిల్లా । రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో సమిష్టిగా కృషి చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన కూటమి నాయకుల సమన్వయ సమావేశంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జోనల్ కమిటీ చైర్మన్ దామాచర్ల సత్య రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు మండిపల్లి లక్ష్మి ప్రసాద్ రెడ్డి ,నాగోతు రమేష్ తాతంశెట్టి నాగేంద్ర అధికారి కృష్ణ ,తంబళ్లపల్లి టిడిపి ఇంచార్జి శంకర్ యాదవ్ పుంగనూరు టిడిపి ఇంచార్జి మధుసూదన్ నాయుడు దారం అనిత , నరేంద్ర చల్లపల్లి నరసింహారెడ్డి తదితర టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక పరిస్థితులు, మూడు పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు చర్చించారు. సీట్ల సర్దుబాటు విషయంలో మూడు పార్టీల నాయకులు పరస్పర అవగాహనతో వ్యవహరిస్తూ, స్థానికంగా కూటమి విజయానికి అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. సీటు ఎవరికొచ్చిందనేది కాదు.. కూటమి అభ్యర్థి గెలుపే ముఖ్యం అనే లక్ష్యంతో పనిచేయాలని, ఒక పార్టీ అభ్యర్థికి కేటాయించిన సీటులో మిగిలిన రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా పూర్తి సహకారం అందించాలని సూచించారు. వార్డు స్థాయి నుంచి మున్సిపల్ స్థాయి వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకే టీమ్‌గా, ఒకే లక్ష్యంతో, సమన్వయంతో పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాలు, చిన్నచిన్న విభేదాలను పక్కన పెట్టి కూటమి ప్రయోజనం, ప్రజల సంక్షేమం, అభ్యర్థుల గెలుపు ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి వార్డులోని ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నుంచి వార్డు, మున్సిపల్ స్థాయి వరకు పటిష్టమైన సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి ఓటును కూటమి అభ్యర్థి విజయానికి మలిచేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. టీడీపీ-జనసేన-బీజేపీ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేస్తే మున్సిపల్ ఎన్నికల్లో చీణూ కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని సుగవాసి ప్రసాద్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

# ఘనంగా సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమం





రాజంపేట సెప్టెంబర్26(మనం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజును పురస్కరించుకొని జరుపుకుంటున్న సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ఉత్సవం కార్యక్రమంలో శనివారం రాజంపేట రూరల్ మండలం ఎల్లాగడ్డ నందు గల అంగన్వాడి కేంద్రాన్ని సంద ర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు సాయి లోకేష్ అంగన్వాడీ ఉత్సవం అసెంబ్లీ ఇంచార్జ్ సునీత నారాయణవర్మ టౌన్ అధ్యక్షుడు వేల్పుల రమణ ప్రధాన కార్యదర్శి సుందర్ బాబు తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా సాయి లోకేష్ అక్కడ పంపిణీ చేయబడుతున్న పోషకాహారాలు గర్భిణీలకు బాలింతలకు చిన్న పిల్లలకి సరిగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా వారితో మాట్లాడి తెలుసుకోవడం జరిగింది అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అంగన్వాడీ కేంద్రాలకి అందుతున్న నిధుల గురించి వారికి సవివరంగా వివరించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్నటువంటి సూపర్వైజర్ రాణి తో మాట్లాడి ఆ అంగన్వాడికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేసుకొని వారి సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేస్తే త్వరితగతిన పరిష్కరించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.తదుపరి అక్కడ సేవలందిస్తున్నటువంటి అంగన్వాడీ వర్కర్ రేవతికి అంగన్వాడీ హెల్పర్ ఇందిరమ్మ కి ఆశ వర్కర్లను సన్మానించడం జరిగింది. తదుపరి అక్కడికి వచ్చినటువంటి తల్లిదండ్రులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి సహాయ సహకారాల వల్ల అంగన్వాడీ కేంద్రాలు బాగా నడుస్తున్నాయని అందుకు మోడీ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మదనపల్లెకు సీఎం చంద్రబాబు: పర్యటన ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం



మనంన్యూస్ మదనపల్లె: సెప్టెంబర్ 26: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అక్టోబర్ 2న మదనపల్లెకు విచ్చేయనుండటంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమాల కోసం సీఎం రాక సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఎమ్మెల్యే షాజహాన్ భాషాలతో కలిసి చంద్ర కాలనీ, బికేపల్లి, జిఎంఆర్ పాలిటెక్నిక్, అంగళ్లు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి సీఎం కాన్వాయ్ మార్గాలు, హెలిప్యాడ్, భారీ బహిరంగ సభా వేదిక స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలో పటిష్ట భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పకడ్బందీ బారికేడ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. సీఎం సభకు భారీగా తరలివచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు సరిపడా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారు లను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఈసమీక్షలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి మరియు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# ఇజ్తిమా సమావేశానికి ప్రతి ముస్లిం సోదరులు హాజరుకావాలి

## జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్ట్ అధ్యక్షుడు సుభహాన్

ఒంటిమిట్ట సెప్టెంబర్ 26(మనం న్యూస్): నవంబరు 8న జరిగే ఇజ్తిమా సమావేశానికి ప్రతి ముస్లిం సోదరులు హాజరుకావాలని నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ పిలుపునిచ్చారు. మలకాటిపల్లి సమీపంలో ఉన్న మదరసా నందు శనివారం ఆయన మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లి వద్ద ఉన్న మదరసా నందు జరిగే ఇజ్తిమా సమావేశానికి బారీ ఎత్తున తరలి రావాలని కోరారు. రాష్ట్ర నలుమూలల నుంచి మత పెద్దలు, ప్రముఖులు, ఇతరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇజితిమా కార్యక్రమం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై చర్చించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. ఇజితిమాకు పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరూ సమయానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.అనంతరం పేదలు, ఇమామ్లు, మౌజన్లకు కుల మతాలకు అతీతంగా పింఛన్లు పంపిణీ చేశారు

# మతాలకు అతీతంగా అండగా భారత చైతన్య యువజన పార్టీ

## బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి ప్రహరి గోడకు 50,వేలు విరాళం



చిట్వేలి సెప్టెంబర్ 26 మనం న్యూస్: రైల్వేకోడూరు భారత చైతన్య యువజన పార్టీ సీనియర్ నాయకులు, శ్రీకృష్ణ యాదవ సంఘం సేవ సమితి కువైట్, ఇండియా అధ్యక్షులు సల్లకంచు రామకృష్ణ తన సొంత నిధులతో ఓబులవారిపల్లి మండలం ముదినేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బండపల్లి యల్లమ్మ తల్లి ప్రహరీ గోడకు బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ముదినేపల్లి గ్రామ పెద్దలకు, ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ వారికి విరాళం అందజేయడం జరిగిందనీ సల్లకంచు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఆలయాల అభివృద్ధిని పలు ట్రస్టుల ద్వారా అభివృద్ధి చేయడం మన అందరి బాధ్యతని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో రామాలయం, గ్రామదేవత ఆలయం, ఉండాలని ఆయన అన్నారు. మన గ్రామాలను మనమే అభివృద్ధి చేసుకోవాలని ప్రతి గ్రామంలో హిందూ సమాజం మన పిల్లలకు మన సనాతన ధర్మాన్ని, మన దైవత్వం గురించి తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ, కువైట్ ఎన్నారై బొల్లు వెంకటేష్, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ రెడ్డిపాకు మహేష్, రైల్వేకోడూరు నియోజకవర్గ రైతు కమిటీ కన్వీనర్ పోకల నాగభూషణ్, ఓబులవారిపల్లి మండలం కన్వీనర్ యానాదయ్య, రైల్వేకోడూరు మండల కో కన్వీనర్ నాగేష్, పలువురు బీసీపార్టీ నాయకులు, కార్యకర్తలు, ముదినేపల్లి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అత్తిరాలలో భక్తిపారవశ్యం

## కనులపండువగా గిరి ప్రదక్షిణ, గంగా హారతి

### శివనామస్మరణతో మార్మోగిన పుణ్యక్షేత్రం

### భారీగా తరలివచ్చిన భక్తజనం



మనం ప్రతినిధి రాజంపేట: సెప్టెంబర్ 26: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అత్తిరాల శనివారం సాయంత్రం భక్తిసాగరమైంది. శ్రీ త్రేతేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల జయజయధ్వానాల నడుమ గిరి ప్రదక్షిణ, గంగా హారతి కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' నినాదాలతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు సారథ్యంలో ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంధ్యావేళలో నదీతీరంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సమర్పించిన గంగా హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులు అత్యంత శ్రద్ధాభక్తులతో గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ, ఎంతో పవిత్ర చరిత్ర, మహిమ కలిగిన అత్తిరాల త్రేతేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గంగా హారతి, గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో ఈ దివ్య క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రముఖ పుణ్యక్షేత్రాలకు దీటుగా అత్తిరాలలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈ మహోత్సవంలో నాయకులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.









# పోలీస్ అంటే భయం కాదు.. ప్రజలకు కొండంత భరోసా!



**ఘనంగా 521 మంది కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ క్రమశిక్షణ**

**మానవత్వంతో విధుల్లో రాణించాలి: మంత్రి ఎస్. సవిత**

**పోలీస్ యూనిఫాం అధికారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత: కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**బాధితుల పక్షాన నిలిచి నమ్మకాన్ని నిలబెట్టాలి: ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**



మనం ప్రతినిధి కడప సెప్టెంబర్ 26

పోలీస్ అంటే ప్రజల్లో భయం కాదని, కష్టాల్లో ఉన్నవారికి కొండంత అండగా నిలుస్తారనే భరోసా కలగాలి" అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పరేడ్ మైదానంలో తొమ్మిది నెలల పాటు సాగిన కఠిన శిక్షణను పూర్తి చేసుకున్న 521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ శనివారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత నవ రక్షకుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. శిక్షణ పొందిన వారిలో కడప డీటీసీకి చెందిన 194 మంది సివిల్, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

**పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక : మంత్రి సవిత**

శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే కానిస్టేబుళ్లే పోలీస్ వ్యవస్థకు అసలైన వెన్నెముక అని మంత్రి సవిత కొనియాడారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి సుమారు 6 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్ల సంక్షేమాన్ని గుర్తించి, వారికి ఇచ్చే నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని గుర్తుచేశారు. ?ప్రస్తుత బడ్జెట్‌లో పోలీస్ రక్షణ రంగానికి రూ.9,165 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం 'శక్తి' యాప్, నేరాల నియంత్రణ కోసం 'ఈగల్ వింగ్' నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. శాఖను మరింత పటిష్టం చేస్తూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఇప్పటికే 6,050 పోస్టులను విడుదల చేశామని, త్వరలోనే మరో 2,000 అదనపు ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల సమస్యలపై మానవీయ కోణంలో స్పందించాలని సూచించారు. సమాజంలో గురుతర బాధ్యత నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగిస్తూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసేవారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

**పోలీస్ యూనిఫాం సేవకే అంకితం :**
**కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

"పోలీస్ యూనిఫాం గౌరవంతో పాటు సమాజం పట్ల అత్యున్నత బాధ్యతను తెచ్చిపెడుతుంది" అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. న్యాయం, సహాయం కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ఆర్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రోజుల్లో అమాయక ప్రజలను ముంచేస్తున్న సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే బాధ్యతను యువ పోలీస్ సిబ్బంది భుజానకెత్తుకోవాలని సూచించారు.

**బాధితులకు భరోసా ఇవ్వాలి :**
**ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**

శిక్షణలో అలవర్చుకున్న కఠిన క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతను నిత్య విధుల్లో కొనసాగించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దిశానిర్దేశం చేశారు. చట్టం ముందు అందరూ సమానులేనన్న భావనతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజలతో మర్యాదగా ఉంటూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల శైలికి అనుగుణంగా సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి అంశాలపై నిరంతరం సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రతిభావంతులకు పురస్కారాల ప్రదానం**

శిక్షణ కాలంలో అసాధారణ ప్రతిభ, శారీరక దారుఢ్యాన్ని కనబర్చిన ఉత్తమ కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, వివిధ స్థాయిల పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ పీఆర్వో వెంకట్ యాదవ్ విశిష్ట వ్యాఖ్యాతగా వ్యవహరించారు.







## క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో విద్యా ప్రమాణాలపై సమగ్ర చర్చ

చిట్వేల్ సెప్టెంబర్ 26 మనం న్యూస్: చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సోఫియా అధ్యక్షతన సెప్టెంబర్ నెల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కాజా మొహిద్దీన్, ఈశ్వరయ్య లు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న విద్యార్థుల ట్రాకింగ్, ఎఫ్ ఏ వన్ ఫలితాల సమీక్ష, సిలబస్ పూర్తి, ఫార్మేటివ్ అసెస్మెంట్, ఎఫ్.ఎల్.ఎన్, అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ విద్యా వనరులు, మూల్యాంకన విధానాలను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల అభ్యసనా ఫలితాలను మెరుగుపరచాలని సూచించారు. పదవ తరగతి మోడల్ పేపర్, ఎఫ్ ఎ-2 కార్యాచరణ, అక్టోబర్ నెల పాఠ్యప్రణాళిక, ml ఆధారిత బోధన, (ప్రసస్ట్), పీఎం.ఈ.విద్య వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు కృష్ణకుమారి, అన్నయ్య, కాలేషా, బాలసుబ్రమణ్యం, సిఆర్పీ చంద్ర, చిట్వేలి, పెనగలూరు మండలాలకు చెందిన ఆంగ్ల, హిందీ ఉపాధ్యాయులు, ఎస్జిటి ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## పింఛన్ల నగదు బ్యాంకుల్లో వేయడం విరమించుకోవాలి జెయన్.ఆంధ్రయ్య

చిట్వేలీ సెప్టెంబర్ 26 మనం న్యూస్: రాష్టంలో అన్నిరకాల పింఛన్లు నగదు బ్యాంకుల్లో వేయడం వల్ల వికలాంగులు, వృద్ధులు నగదు తీసుకొనేందుకు బ్యాంకు క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడతారని గతంలో లాగానే పింఛన్లు నగదు మొత్తం ఒకే సారి ఇంటి దగ్గరే ఇవ్వాలని ఏపీ వికలాంగుల పింఛన్ దార్ల సమక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.యన్ ఆంధ్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా పింఛన్లు సొమ్ము రెండు భాగాలు చేయడం తగదన్నారు. కొత్త



పింఛన్లు అర్హులైన వికలాంగులకు వృద్ధులు, వితంతువులు, అర్హులైన వారందరికీ మంజూరు చేయాలన్నారు. రాజకీయ నాయకులు, తమ అనుచరులైన అనర్హుల పేర్లు స్వర్ణ గ్రామ వార్డు సచివాలయంలో పేర్లు నమోదు చేసినట్లు పిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వం అనర్హులు పేర్లు తొలిగించి నిజమైన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ బాధితులకు పింఛన్లు మంజూరు చేసి న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు, వికలాంగులు, వృద్ధులు, పింఛన్ దార్లు పాల్గొన్నారు.

# ఉదయం లేవగానే ఫోన్ చూడొద్దు.. 5 నిమిషాలు ఇలా చేస్తే రోజంతా ప్రశాంతంగా!

**శ్వాసపై దృష్టి పెట్టి ప్రశాంతంగా కూర్చోవాలి - సహజంగా వచ్చే ఆలోచనలను ఆపొద్దు**

**చుట్టూ వినిపించే శబ్దాలను గమనించాలి - శరీరంలో ఒత్తిడి ఉందో లేదో గుర్తించాలి**

**5 నిమిషాలు కుదరకపోతే 2 నిమిషాలతో మొదలుపెట్టొచ్చు**

ఉదయం నిద్ర లేవగానే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది ఫోనే. ఒక్కసారి స్క్రీన్ ఆన్ చేస్తే చాలు.. మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, వార్తలు, సోషల్ మీడియా పోస్టులు వరుసగా మన దృష్టిని ఆకర్షిస్తాయి. మన రోజు మొదలయ్యేలోపే మనసు ఎన్నో విషయాలతో నిండిపోతుంది. అయితే.. ఫోన్ అందుకునే ముందు కేవలం ఐదు నిమిషాలు ప్రశాంతంగా గడిపితే ఎలా ఉంటుంది? పెద్దగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. మెడిటేషన్ యాప్ అవసరం లేదు. ప్రత్యేకమైన మ్యూజిక్ కూడా అక్కర్లేదు. ఆ ఐదు నిమిషాలు స్క్రీన్‌కు దూరంగా ఉంటే చాలు.

**మనసుకు సమయం ఇవ్వండి**

సౌకర్యంగా కూర్చోండి. ఫోన్‌ను కాస్త దూరంగా పెట్టండి. కళ్లు మూసుకోవచ్చు లేదా కిటికీలోంచి బయటకు చూడొచ్చు. నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ దానిపై కాసేపు దృష్టి పెట్టండి. మనసులో ఆలోచనలు రావడం సహజమే. ఏదైనా పని గుర్తొచ్చినా, రోజు గురించి ఆలోచించినా ఇబ్బంది లేదు. ఆ ఆలోచనను బలవంతంగా ఆపాల్సిన అవసరం లేదు. మళ్లీ శ్వాసపై లేదా చుట్టూ వినిపించే శబ్దాలపై దృష్టి పెట్టండి.

**మొదట్లో ప్రశాంతంగా అనిపించకపోవచ్చు**

మొదటి రోజే మనసు ప్రశాంతంగా అయిపోతుందని అనుకోవద్దు. పెండింగ్ పని గుర్తుకు రావచ్చు. ఎవరికో పంపాల్సిన మెసేజ్ గుర్తు రావచ్చు. ఆఫీస్ పని గురించి ఆలోచనలు మొదలవ్వొచ్చు. ఐదు నిమిషాలు ఎప్పుడు పూర్తవుతాయో కూడా చూడాలనిపించొచ్చు.

ఇదంతా సహజమే. మైండ్‌ఫుల్‌నెస్ అంటే అసలు ఆలోచనలు లేకుండా కూర్చోవడం కాదు. మన దృష్టి ఎక్కడికి వెళ్లిందో గుర్తించి.. దాన్ని మెల్లగా ప్రస్తుత క్షణంపైకి తీసుకురావడం.



మైండ్‌ఫుల్‌నెస్ ఆధారిత విధానాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడొచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే వివిధ అధ్యయనాల్లో ఫలితాలు ఒకేలా లేవని, నిర్దిష్ట పద్ధతులు, ఫలితాలపై మరింత పరిశోధన అవసరమని పరిశోధకులు చెబుతున్నారు.

**ఇలా ప్రయత్నించండి**

మొదటి నిమిషం: ప్రశాంతంగా కూర్చొని సహజంగా శ్వాస తీసుకోండి.

తర్వాత రెండు నిమిషాలు: చుట్టూ వినిపించే శబ్దాలను గమనించండి. పక్షుల శబ్దం, వాహనాల శబ్దం, ఫ్యాన్ శబ్దం.. ఏదైనా కావచ్చు.

నాలుగో నిమిషం: మీ శరీరం ఎలా ఉందో గమనించండి. భుజాలు బిగుసుకున్నాయా? దవడ దగ్గర ఒత్తిడి ఉందా? ఇంకా నిద్ర మత్తు ఉందా?

చివరి నిమిషం: ఆ రోజు మీరు సాధించాలనుకునే ఒక్క విషయాన్ని గుర్తు చేసుకోండి. పెద్ద లక్ష్యం కావాల్సిన అవసరం లేదు. ఓ ముఖ్యమైన పని పూర్తి చేయడం కావచ్చు. ఎవరి మీదా తొందరపడకుండా మాట్లాడటం కావచ్చు.

**ఆ తర్వాత ఫోన్ తీసుకోండి.**

ఐదు నిమిషాలే.. కానీ క్రమం మారుతుంది. ఇక్కడ ముఖ్యమైన విషయం ఐదు నిమిషాల వ్యవధి కాదు. నిద్ర లేవగానే ప్రపంచం నుంచి సమాచారం తీసుకోవడం కంటే ముందు.. మీకు మీరు కొంత సమయం ఇవ్వడం.

రోజూ ఐదు నిమిషాలు సాధ్యంకాకపోతే రెండు నిమిషాలతో మొదలుపెట్టొచ్చు. కుర్చీలో కూర్చున్నా సరే. కిటికీ దగ్గర ఉన్నా సరే. ధ్యానం కోసం ప్రత్యేకమైన ప్రదేశం, పరుపు, సువాసన కొవ్వొత్తులు అవసరం లేదు. ఉదయం లేచిన వెంటనే ప్రతిదానికీ స్పందించకుండా.. కాసేపు ఆగడం మాత్రమే ఈ చిన్న అలవాటు ఉద్దేశం. కొన్ని రోజుల తర్వాత ఆ ప్రశాంతమైన ఐదు నిమిషాల కోసం మీరు ఎదురుచూసే సమయం రావచ్చు.